21 మంది అభ్యర్థులు.. 32 నామినేషన్లు

- ముగిసిన నామినేషన్ల ఘట్టం
- ఆఖరి రోజు 10 నామినేషన్లు దాఖలు

గాజువాక : సార్వత్రిక ఎన్నికల్లో నామినేషన్ల ఘట్టం గురువారంతో ముగిసింది. మే 13న నిర్వహించనున్న ఎన్నికలకు సంబంధించి గాజువాక నియోజకవర్గంలో 21మంది అభ్యర్థులు 32 సెట్ల నామినేషన్లు సమర్పించారు. 2019 నాటి ఎన్నికల్లో పోటీ చేసేందుకు 15 మంది అభ్యర్థులు నామినేషన్ వేయగా, ఈ సారి ఆ సంఖ్య పెరిగింది. ఈ నెల 18న ప్రారంభమైన నామినేషన్ల ప్రక్రియలో ఆఖరి రోజైన గురువారం వరకు 32 నామినేషన్లు అందినట్లు గాజువాక ఎన్నికల రిటర్నింగ్ అధికారి డి.లక్ష్మారెడ్డి తెలిపారు.

గురువారం ఒక్కరోజే పది మంది అభ్యర్థులు నామినేషన్లు సమర్పించారు. ఇప్పటికే నామినేషన్లు సమర్పించిన ప్రముఖ పార్టీల అభ్యర్థులు కూడా ఆఖరిరోజు మరోసారి తమ నామినేషన్లను దాఖలు చేశారు. వైఎస్సార్‌సీపీ గాజువాక ఎమ్మెల్యే అభ్యర్థిగా గుడివాడ అమర్‌నాథ్ రెండు సెట్ల నామినేషన్ పత్రాలను సమర్పించగా, టీడీపీ అభ్యర్థి పల్లా శ్రీనివాసరావు ఒక సెట్ నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి వద్ద దాఖలు చేశారు. వీరిద్దరూ బుధవారం కూడా నామినేషన్లు దాఖలు చేసిన విషయం తెలిసిందే. వీరితో పాటు టీడీపీ అభ్యర్థిగా పల్లా కార్తీక్ యాదవ్, దళిత బహుజన పార్టీ అభ్యర్థిగా శామ్యూల్ జాన్ ధర్మరాజు రాయపాటి, ప్రజా ప్రస్థానం నుంచి తలుపుల శైలజ, జై మహాభారత్ పార్టీ నుంచి కాండ్రేగుల ఆదినారాయణ, నవతరం పార్టీ అభ్యర్థిగా సుంకరి సారా జ్యోతి, నవభారత్ నిర్మాణ సేవా పార్టీ నుంచి బత్తుల నీలకంఠంతో పాటు స్వతంత్ర అభ్యర్థులుగా కొవిరి కృష్ణ, కాకర్లమూడి కృష్ణ ప్రదీప్ నామినేషన్లను సమర్పించినట్టు రిటర్నింగ్ అధికారి తెలిపారు.


నామినేషన్ దాఖలుచేస్తున్న ఇండిపెండెంట్ అభ్యర్థి కొవిరి కృష్ణ

నేడు నామినేషన్ల పరిశీలన

26వ తేదీన నామినేషన్ల పరిశీలన ప్రక్రియను పూర్తి చేస్తారు. 29వ తేదీ సాయంత్రం 3 గంటల వరకు నామినేషన్లను ఉపసంహరించుకోవచ్చు. అదేరోజు సాయంత్రం అభ్యర్థులకు ఎన్నికల గుర్తులను కేటాయించి, కేటగిరీల వారీగా విభజించి అభ్యర్థుల తుది జాబితా రూపొందిస్తారు.

క్రమ సంఖ్య	అభ్యర్థి పేరు	పార్టీ	సెట్లు
1.	ఎ.వి.ఎస్.ఎస్.అమర్‌నాథ్ గుడివాడ	వైఎస్సార్‌సీపీ	4
2.	రంగూరి హిమగౌరి	వైఎస్సార్‌సీపీ	2
3.	మరడాన జగ్గునాయుడు	సీపీఎం	3
4.	మైలవరపు రాంబాబు	సీపీఎం	1
5.	పల్లా శ్రీనివాసరావు	తెలుగుదేశం పార్టీ	4
6.	పల్లా కార్తీక్ యాదవ్	తెలుగుదేశం పార్టీ	1
7.	నందికోళ్ల అప్పారావు	బహుజన సమాజ్ పార్టీ	1
8.	శామ్యూల్ జాన్ ధర్మరాజు రాయపాటి	దళిత బహుజన పార్టీ	1
9.	కిలారి ఆనంద్	ప్రజాశాంతి పార్టీ	1
10.	పల్లి శ్రీనివాసరావు	జాతీయ జనసేన పార్టీ	1
11.	సుంకరి సారా జ్యోతి	నవతరం పార్టీ	1
12.	బత్తుల నీలకంఠం	నవభారత నిర్మాణ సేవా పార్టీ	1
13.	తలుపుల శైలజ	ప్రజా ప్రస్థానం పార్టీ	1
14.	పెబ్బిలి సత్యనారాయణ మూర్తి	పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా	1
15.	తోట అక్కయ్య	లోక్ తంత్రిక్ జనతాదళ్	2
16.	చోడవరపు శంకర్	జనవాహిని పార్టీ	1
17.	కాండ్రేగుల ఆదినారాయణ	జై మహాభారత్ పార్టీ	1
		ఇండిపెండెంట్	1
18.	సీమకుర్తి శ్రీనివాసరావు	ఇండిపెండెంట్	1
19.	గవర రోహిణి కుమారి	ఇండిపెండెంట్	1
20.	కొవిరి కృష్ణ	ఇండిపెండెంట్	1
21.	కాకర్లమూడి కృష్ణ ప్రదీప్	ఇండిపెండెంట్	1

క్లుప్తంగా

ఘనంగా దుర్గమాంబ జాతర


దుర్గమాంబ అమ్మవారు

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు డొంకాడ నిర్వాసిత కాలనీవాసుల గ్రామదేవత దుర్గమాంబ అమ్మవారి జాతర గురువారం ఘనంగా జరిగింది. అమ్మవారిని దర్శించుకుని, మొక్కులు చెల్లించేందుకు అధిక సంఖ్యలో వచ్చిన భక్తులతో ఆలయం వద్ద వేకువ జాము నుంచి సందడి నెలకొంది. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మజ్జిగ, పులిహోర ప్రసాద వితరణ చేపట్టారు. ఆలయ, ఉత్సవ కమిటీలు ఆలయ ఆవరణాన్ని అధునాతన విద్యుద్దీపాలతో అలంకరించారు. గ్రామ పెద్దలు, నాయకులు అమ్మవారిని దర్శించుకున్నారు. సాయంత్రం ఏర్పాటు చేసిన సప్తస్వర భక్తి గీతాంజలి కార్యక్రమం అలరించింది. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు దాసరి త్రినాథ్, సన్యాసిరావు, బొబ్బరి అప్పారావు, కరణం పెంటారావు, పాడుగు భాస్కర రావు, బంటు రమణ తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీ హైస్కూల్‌కు కుర్చీల వితరణ


కార్యక్రమంలో పాల్గొన్న క్లబ్ ప్రతినిధులు

అక్కిరెడ్డిపాలెం: వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో అక్కిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్‌కు 10 కుర్చీలను అందజేశారు. వాసవీ క్లబ్ అక్కిరెడ్డిపాలెం, నాతయ్యపాలెం రీజనల్ చైర్‌పర్సన్ అవేర్‌నెస్ కార్యక్రమాన్ని 68వ వార్డు అక్కిరెడ్డిపాలెంలో గురువారం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన క్లబ్ ఆర్‌సీ రీజియన్-4 డిస్ట్రిక్ట్ కేసరపు నాగేశ్వరరావును క్లబ్ ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. అనంతరం పాఠశాలకు కుర్చీలు అందించారు. క్లబ్ అధ్యక్షుడు సున్నా గాంధీ గుప్తా, కార్యదర్శి జి.కుమార స్వామి, కోశాధికారి ఎన్.శ్రీరామ్మూర్తి, ప్రతినిధులు పాల్గొన్నారు.

మరిడిమాంబ ఆలయ రికార్డుల పరిశీలన

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు కొండయ్యవలస గ్రామదేవత మరిడమాంబ ఆలయ జాతర విషయంలో ఫిర్యాదు మేరకు దేవదాయ శాఖ ఫీల్డ్ ఆఫీసర్ వసంతరావు రికార్డులు పరిశీలించారు. ఆలయ కమిటీ రిజిస్ట్రేషన్ సమయంలో కొంతమంది ఉక్కు ఉద్యోగులు నిరుద్యోగులుగా చూపించారని, జాతర సందర్భంగా చందాలు వసూలు చేసి బ్యాంక్ ఖాతాలో వేయకుండా వ్యక్తిగత ఖాతాల్లోకి మళ్లిస్తున్నారని ఆరోపిస్తూ సమాచార హక్కు చట్టం కార్యకర్త పట్టా రామ అప్పారావు దేవాదాయశాఖ, పోలీస్ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు దేవదాయ శాఖ అధికారి ఆలయం వద్ద రికార్డులు పరిశీలించారు. తదుపరి ఉన్నతాధికారుల రికార్డులు పరిశీలించనున్నామని చెప్పారు. లావాదేవీలు బ్యాంక్ ఖాతా ద్వారా చేయాలని కమిటీ ప్రతినిధులకు సూచించారు.

'ఉక్కునగర వాసులపై విద్యుత్ భారం సరికాదు'


ధర్నాలో ప్రసంగిస్తున్న కార్పొరేటర్ గంగారావు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లో నివసిస్తున్న వారి విద్యుత్ చార్జీల పెంపు సర్క్యులర్‌ను తక్షణం ఉపసంహరించుకోవాలని 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి. గంగారావు డిమాండ్ చేశారు. సర్క్యులర్‌ను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ ఉక్కు పరిపాలన భవనం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. యాజమాన్యం ఏకపక్షంగా ఉక్కునగరవాసులపై భారం మోపుతోందని ఆరోపించారు. యూనియన్ గౌరవ అధ్యక్షుడు జె.అయోధ్యరామ్ మాట్లాడుతూ యాజమాన్యం ఇటువంటి నిర్ణయం తీసుకున్నా, గుర్తింపు యూనియన్ స్పందించకపోవడం దుర్మార్గమన్నారు. ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి మాట్లాడుతూ కార్మికులపై విద్యుత్ భారం మోపడం అన్యాయమన్నారు. అధ్యక్షుడు వై.టి.దాస్, పి.శ్రీనివాసరాజు, బి.అప్పారావు, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలోకి టీడీపీ నేతలు


వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ నాయకులు, కార్యకర్తలతో మంత్రి అమర్‌నాథ్

అక్కిరెడ్డిపాలెం: వైఎస్సార్‌సీపీలోకి వలసల పర్వం కొనసాగుతోంది. 73వ వార్డు తెలుగుదేశం పార్టీకి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు కార్పొరేటర్ భూపతిరాజు సుజాత ఆధ్వర్యంలో రాష్ట్ర మంత్రి, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్ సమక్షంలో పార్టీలో చేరారు. చట్టివానిపాలెంలోని పార్టీ కార్యాలయంలో మంత్రి అమర్‌నాథ్ వారికి కండువాలు వేసి, వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్‌మోహన్ రెడ్డి అందిస్తున్న సంక్షేమ పరిపాలన, అభివృద్ధిని చూసి పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు. టీడీపీలో కార్యకర్తలకు విలువ లేదన్నారు. వైఎస్సార్ సీపీలో కార్యకర్తలకు క్రమశిక్షణతో కూడిన విలువలు ఉన్నాయన్నారు. మంత్రి అమర్‌నాథ్ మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీలో సేవలందించిన కార్యకర్తలకు ఎప్పుడూ సముచిత స్థానం ఉంటుందన్నారు. పార్టీలో చేరిన వారిలో కరణం కనకారావు, దాసరి హరీష్, గేదెల లక్ష్మణరావు, కరణం దుర్గారావు, వసంత రమణ, వాసపల్లి రాజు, నీలకాయల అప్పలరాజు, మడకల గోవిందరావు, పెద్దింటి రామకృష్ణ, గొర్లి శివకుమార్ తదితరులున్నారు.

29న పెంటమాంబ పండగ


ఆహ్వాన పత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

పెదగంట్యాడ: నెల్లిముక్కు గ్రామ పంచాయతీ పరిధిలోని 14 గ్రామాల ప్రజల ఆరాధ్య దేవత పెంటమాంబ అమ్మవారి ప్రధాన పండగను ఈ నెల 29న వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఈ నెల 18న ప్రారంభమైన ఉత్సవాలు 29 వరకు కొనసాగనున్నట్లు చెప్పారు. ఆలయ ప్రాంగణంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఉత్సవాల ఆహ్వాన పత్రికను ఆవిష్కరించి, వివరాలు వెల్లడించారు. ఈ నెల 29న ప్రధాన పండగ సందర్భంగా ముందు రోజు అర్ధరాత్రి ఒంటి గంట నుంచి అమ్మవారికి విశేష పూజలు చేసి, భక్తులకు దర్శనాలు కల్పించనున్నట్లు చెప్పారు. ఉదయం దేవీ హోమం, పూర్ణాహుతి తదితర పూజా కార్యక్రమాలతో పాటు అదే రోజు అమ్మవారి అనుపు ఉంటుందన్నారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక ఏర్పాట్లు చేపడుతున్నామన్నారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామని చెప్పారు. సమావేశంలో గొందేశి మహేశరరెడ్డి, గొందేశి అప్పలరెడ్డి, పులి రమణారెడ్డి, అప్పల రెడ్డి, గొందేశి సత్యారావు, యేల్లేటి శ్రీనివాసరావు, మొల్లి రమణ, గంట్యాడ పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీతోనే సంక్షేమ పాలన

పార్టీ నేతల విస్తృత ప్రచారం


అంబేడ్కర్ కాలనీలో కరపత్రాలు అందిస్తున్న నాయకులు

అగనంపూడి: ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపుతోనే మరింత అభివృద్ధి సాధ్యమని 87వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోమటి శ్రీనివాసరావు తెలిపారు. కుల, మత, రాజకీయాలకతీతంగా పేదలందరికీ సంక్షేమ పథకాలందించిన సంక్షేమ ప్రదాతను గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. వార్డులోని 65, 70 పోలింగ్ బూత్‌ల పరిధిలోని కణితి ఆర్‌హెచ్‌సీ, లక్ష్మీపురం కాలనీల్లో ఇంటింటావిస్తృత ప్రచారం చేపట్టారు.

వైఎస్సార్‌సీపీ విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ, గాజువాక ఎమ్మెల్యే అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్‌లను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు వడ్లపూడి ఈశ్వరరావు, శీరం పాపారావు, వంద్రాసి వెంకటరావు, కోనేటి పారిపల్లి, కోమటి రమాదేవి, కణితి అప్పలరాజు, శంకరరావు, నగేష్, చేబోలు యశోద తదితరులు పాల్గొన్నారు.


87వ వార్డులో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి కోమటి శ్రీనివాసరావు

కణితి అంబేడ్కర్ కాలనీలో..

విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ, ఎమ్మెల్యే అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్‌లను గెలిపించాలని కోరుతూ 87వ వార్డు కణితి అంబేడ్కర్ కాలనీలో వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రచారం చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేసి, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో చేసిన అభివృద్ధిని వివరించారు. కార్యక్రమంలో పార్టీ గాజువాక మండల అధ్యక్షుడు బొడ్డ గోవింద్, సీనియర్ నాయకులు ప్రగడ వేణుబాబు, గాలి ఆనంద్, ముద్దపు దామోదర్, పిన్నింటి సంతోష్, ఆడారి శ్రీను, పార్వతి, సబ్బువరపు ఈశ్వరరావు, కాండ్రేగుల కనకలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ముస్లిం మైనార్టీల ఆత్మీయ సదస్సు రేపు

అక్కిరెడ్డిపాలెం: గాజువాక నియోజకవర్గం నూర్ బాషా బీసీ ముస్లిం మైనార్టీల ఆత్మీయ సదస్సును శనివారం ఉదయం 10 గంటలకు 68వ వార్డు గుడివాడ అప్పన్న కల్యాణ మండపంలో నిర్వహించనున్నట్లు నూర్ బాషా బీసీ ముస్లిం మైనార్టీ ఉత్తరాంధ్ర కన్వీనర్ షేక్ ఇస్మాయిల్ గురువారం తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా నూర్ బాషా ముస్లిం మైనార్టీల అభ్యున్నతికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో సహకారం అందించారన్నారు. ఈ నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మి, ఎమ్మెల్యే అభ్యర్థి, మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌లతో ఆత్మీయ సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీకి తమ మద్దతు తెలియజేస్తామన్నారు. సదస్సుకు సంఘాల పెద్దలు హాజరు కావాలని కోరారు.

జేఈఈ ఫలితాల్లో శ్రీచైతన్య విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న అధ్యాపకులు

గాజువాక : ఎన్‌టీఏ ప్రకటించిన జేఈఈ మెయిన్స్ 2024 ఫలితాల్లో గాజువాక జోన్‌కు చెందిన శ్రీచైతన్య జూనియర్ కళాశాలల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ ప్రదర్శించారు. ఆలిండియా స్థాయిలో సత్యం 163వ ర్యాంక్, కె.జ్ఞానికృష్ణ 168, పి.రిత్విక్ 177, ఇ.లోకేష్ 458, డి.శరవన్ నాయుడు 548, ఎస్.నవ్య 904, కె.కిరణ్ రామచంద్ర 930, డి.రామ్ నీరజ్ 945, పి.సుష్మ నాగ త్రిలోచన 971, ఎల్.భార్గవ్ 1093, వి.దీక్షిత 1114, ఎం.అక్షయ్ కుమార్1308, ఎస్.ఎస్.ఎస్.ఎన్.పవన్ తేజ 1445, ఎం.సుధీర్ 1523, కె.తరుణ్ కుమార్ 1572, ఎ.మహేష్ 2130, పి.కైలాష్ భరత్ 2328, బి.సాహితి వేద 9564 ర్యాంక్ సాధించినట్టు కళాశాల ఎగ్జిక్యూటివ్ ఏజీఎం కె.వి.రమణ తెలిపారు. సుమారు 25 మంది విద్యార్థులు ఎన్ఐటీల్లో సీట్లు సాధిస్తారని పేర్కొన్నారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులను ఎగ్జిక్యూటివ్ డీన్‌లు కె.బంగారు బాబు, ఎస్.రఘుకుమార్, ఏజీఎం పి.శ్రీనివాసరావు, డీన్‌లు అభినందించారు.

పరిసరాల శుభ్రతతో మలేరియా నివారణ


దేవాడలో ర్యాలీ నిర్వహిస్తున్న పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రదీప్‌రాజా , సిబ్బంది

పెదగంట్యాడ: పరిసరాల శుభ్రతతో మలేరియాకు చెక్ పెట్టవచ్చని దేవాడ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ప్రదీప్ ప్రసాద్‌రాజా అన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకుని పీహెచ్‌సీ ఆధ్వర్యంలో దేవాడలో గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమ కాటు వల్ల మలేరియా వస్తుందని తెలిపారు. ఇల్లు, పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా దోమలను నివారిస్తే చాలావరకు వ్యాధులు రాకుండా అరికట్టవచ్చని చెప్పారు. కార్యక్రమంలో సిబ్బంది ఎం. శ్రీనివాసరావు, కె.అన్నపూర్ణ, బి.గోపాలం, సునీత, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అదీప్‌కు మద్దతుగా ఇంటింటి ప్రచారం


లంకెలపాలెంలో ప్రచారం నిర్వహిస్తున్న వార్డు ఇన్‌చార్జి అప్పికొండ మహాలక్ష్మినాయుడు

అగనంపూడి: పెందుర్తి ఎమ్మెల్యే అభ్యర్థి అన్నంరెడ్డి అదీప్‌రాజ్, ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాల నాయుడిని గెలిపించాలని కోరుతూ 79వ వార్డు లంకెలపాలెంలో వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి అప్పికొండ మహాలక్ష్మినాయుడు ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బీసీ కాలనీ, కరణం దొడ్డి ప్రాంతాల్లో నాయకులు, మహిళలు కరపత్రాలు పంపిణీ చేసి, వైఎస్సార్‌సీపీకి ఓటేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సుందరపు అప్పారావు, కర్రి నరసింగరావు, నెల్లి కన్నబాబు, ఎలమర్తి వెంకటరావు, కాతా సూరేష్, దాసరి ప్రకాష్, నెల్లి అప్పారావు పాల్గొన్నారు.

ప్రజా ఉద్యమంతో 'ఉక్కు' పరిరక్షణ


మాట్లాడుతున్న ఉక్కు కార్మిక సంఘం నాయకుడు ఆదినారాయణ

అగనంపూడి: ప్రజా ఉద్యమాలతో విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకుంటామని విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, శ్రీనివాసరావు అన్నారు. విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో కూర్మన్నపాలెంలో 1169వ రోజు రిలే దీక్షా శిబిరంలో వారు మాట్లాడారు. కొన్ని ప్రధాన రాజకీయ పార్టీలు విశాఖ ఉక్కు పరిరక్షణ విషయంలో సవతి ప్రేమ ఒలకబోస్తున్నాయన్నారు. కేంద్రానికి కొమ్ము కాస్తుండడం వల్లే విశాఖ ఉక్కుకు ఈ దుస్థితి కలిగిందని ఆరోపించారు. సొంత గనులు కేటాయించడం ద్వారా స్టీల్‌ప్లాంట్‌కు పూర్వ వైభవం వస్తుందని, ఈ దిశగా అన్ని రాజకీయ పార్టీలు సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

'పోర్టు యాజమాన్యం కుట్రలను ఐక్యంగా తిప్పికొట్టాలి'


గంగవరం పోర్టు గేటు వద్ద బైఠాయించిన కార్మికులు

పెదగంట్యాడ: కార్మికులను బెదిరించేందుకు గంగవరం పోర్టు యాజమాన్యం చేస్తున్న ప్రయత్నాలను కార్మికులంతా ఐక్యంగా తిప్పి కొట్టాలని గంగవరం పోర్టు నిర్వాసిత సంఘ నాయకులు అన్నారు. తమ డిమాండ్ల సాధన కోసం 15 రోజులుగా గంగవరం పోర్టు గేటు వద్ద కార్మికులు ఆందోళన చేస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో పోర్టు యాజమాన్యం సమ్మెలో ఉన్న కార్మికులందరికీ వ్యక్తిగత నోటీసులు జారీ చేసింది. ముందస్తు సమాచారం లేకుండా సమ్మె చేయడంపై వివరణ ఇవ్వాలని ఆ నోటీసులో కోరింది. దీంతో కార్మికులంతా ఆందోళన చెందారు. అయినా, వారంతా పట్టు విడువలేదు. గురువారం కూడా కుటుంబాలతో కలసి పోర్టు గేటు వద్ద బైఠాయించారు. యాజమాన్యం తీరు మార్చుకోకపోతే భవిష్యత్తులో పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. తమకు నెలకు రూ.36వేలు వేతనాలు ఇవ్వాలని, కార్పొరేట్ ఆస్పత్రుల్లో వైద్య సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో వన్ టైమ్ సెటిల్‌మెంట్ చేయాలన్నారు.

తీరనున్న రైల్వే వంతెన కష్టాలు


పాస్‌వే వంతెన నిర్మించనున్న లంకెలపాలెం ఫ్లై ఓవర్ వంతెన


రైల్వేట్రాక్ దాటుతూ రాకపోకలు సాగిస్తున్న స్థానికులు

- రైల్వే అండర్‌పాస్ వంతెనకు బోర్డు గ్రీన్ సిగ్నల్
- రూ.4.91 కోట్లతో లంకెలపాలెం ఫ్లైఓవర్‌ను ఆనుకుని నిర్మాణం
- లంకెలపాలెం వాసులకు తగ్గనున్న దూరాభారం

అగనంపూడి: లంకెలపాలెంవాసుల రైల్వే వంతెన కష్టాలు తీరనున్నాయి. రైల్వే ఫ్లైఓవర్ వంతెనను ఆనుకుని అండర్‌పాస్ వంతెన నిర్మించాలన్న పదిహేనేళ్ల కల నెరవేరనుండడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రైల్వే ఉన్నతాధికారులకు, పాలక పక్షానికి అనకాపల్లి ఎంపీ సత్యవతి చేసిన విజ్ఞప్తి మేరకు స్పందించిన రైల్వే బోర్డు అధికారులు రూ.4 కోట్ల 92 లక్షలు నిధులు మంజూరు చేస్తూ ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు.

దువ్వాడ, తాడి రైల్వే స్టేషన్ల మధ్య ఉన్న లంకెలపాలెం రైల్వే క్రాసింగ్ గేటు వద్ద గంటల తరబడి వాహనాలు నిలిచిపోతుండడంతో రాంకీ ఫార్మాసిటీ ఉద్యోగులు, ఫార్మా కంపెనీల యాజమాన్యాల విజ్ఞప్తి మేరకు లంకెలపాలెం రైల్వే క్రాసింగ్ వద్ద వంతెన నిర్మించారు. దీంతో లంకెలపాలెం మీదుగా ప్రయాణం సాగించే వాహనదారుల ఇబ్బందులు తీరినా.. లంకెలపాలెం వాసులకు మాత్రం కొత్త కష్టాలు వచ్చి పడ్డాయి.

చుట్టూ తిరిగి వెళ్లాల్సిందే..

రైల్వే ట్రాక్‌కు రెండు వైపులా లంకెలపాలెం గ్రామం విస్తరించి ఉండడం, వంతెన నిర్మాణంతో క్రాసింగ్ గేట్లు ఎత్తివేయడంతో గ్రామ ప్రజలు ఒక వైపు నుంచి మరోవైపునకు రాకపోకలు సాగించడానికి ఇబ్బంది పడుతున్నారు. జాతీయ రహదారి లంకెలపాలెం కూడలి నుంచి గ్రామంలోకి బంధువులు ఇంటికి వెళ్లాలంటే వాహనంపై చుట్టు తిరిగి ప్రయాణం చేయాల్సిన పరిస్థితి. లేదంటే అనధికారికంగా పట్టాలపై నుంచి వెళ్లాలి. అండర్ పాస్ వంతెన నిర్మిస్తే చుట్టుయాత్ర చేసే యాతన తప్పుతుందని స్థానికులు ఎన్నో ఏళ్లుగా పాలకులకు విజ్ఞప్తి చేస్తూనే ఉన్నారు. ఇదే విషయాన్ని స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు ఎంపీ భీశెట్టి సత్యవతి దృష్టికి తీసుకువెళ్లడంతో ఆమె ప్రత్యేక చొరవ తీసుకుని రైల్వే ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేశారు. అలాగే బోర్డు పాలక వర్గాన్ని సంప్రదించి సమస్యను వివరించడంతో ఎట్టకేలకు స్పందించిన అధికారులు నిధులు మంజూరు చూస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్నికలు పూర్తి కాగానే పనులు ప్రారంభం కానున్నాయి.

ఒకటి నుంచి బాలల నటనా శిక్షణ శిబిరం


పోస్టర్ ఆవిష్కరిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: నవరస థియేటర్స్ ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వచ్చే నెల ఒకటో తేదీ నుంచి బాల బాలికల నటనా శిక్షణ శిబిరం నిర్వహించనున్నట్టు సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి పి.వి.రమణమూర్తి తెలిపారు. ఈ మేరకు పోస్టర్‌ను ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి గురువారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంగసాయి నాటక గ్రంథాలయం సహాయంతో నెల రోజుల శిక్షణ కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఆర్‌టీసీ కాంప్లెక్స్ దగ్గరున్న రంగసాయి నాటక గ్రంథాలయ ప్రాంగణంలో శిబిరం జరుగుతుందన్నారు. ఆసక్తి ఉన్న వారు పూర్తి వివరాలకు 98484 61959, 86395 07458 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఒకటో తేదీ నుంచి ప్రత్యేక యోగా శిబిరాలు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం యోగా కేంద్రంలో చిన్నారుల కోసం ప్రత్యేక యోగా శిక్షణ శిబిరాన్ని వచ్చేనెల ఒకటి నుంచి 15వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు కేంద్రం సంచాలకుడు ఆచార్య ఓ.ఎస్.ఆర్.యు.భానుకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. 7 నుంచి 15 సంవత్సరాలు వయస్సు కలిగిన బాల బాలికలు ఈ శిబిరంలో పాల్గొనవచ్చునన్నారు. ప్రతి రోజు ఉదయం 7 నుంచి 8 గంటల వరకు ఈ శిబిరం జరుగుతుందన్నారు.

– యోగా విలేజ్‌లో మే 1 నుంచి సాధారణ యోగ, స్థూలకాయ నివారణ శిబిరాలను ప్రారంభిస్తున్నట్లు కేంద్రం సంచాలకులు తెలిపారు. ఉదయం 7 నుంచి 8, ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సాధారణ యోగా, సాయంత్రం 4 నుంచి 5, సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు స్థూలకాయ నివారణ శిబిరాలు నిర్వహించనున్నామన్నారు. ఆసక్తి కలిగిన వారు 94944 01919, 93980 19922 నంబర్లలో సంప్రదించాలన్నారు.